AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAY.
7-11-2025 (Friday) MAIN EDITION

## శబరిమలకు 60 ప్రత్యేక రైళ్లు



**అక్షరటుడే, హైదరాబాద్:** శబరిమల భక్తులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త చెప్పింది. తెలుగు రాష్ట్రాల నుంచి ప్రత్యేక రైళ్లను నడపనుంది. మొత్తం 60కిపైగా స్పెషల్ ట్రెయిన్లు నడపనున్నట్లు ప్రకటించింది. అయితే నేటి నుంచే రిజర్వేషన్‌కు అవకాశం కల్పించింది. ఈ స్పెషల్ రైళ్లు చర్లపల్లి, మచిలీపట్నం, నర్సాపూర్ నుంచి ఏర్పాటు చేశారు. చర్లపల్లి నుంచి పది రైళ్లు, అదే విధంగా మచిలీపట్నం, నర్సాపూర్ నుంచి మరో 50 రైళ్లను నడపనున్నట్లు అధికారులు ప్రకటించారు.

## ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌లో సమస్య..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌లో సాంకేతిక సమస్య తెలెత్తింది. దీంతో ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో పలు విమానాల రాకపోకలు ఆలస్యం అయ్యాయి. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థలో సాంకేతిక లోపంతో శుక్రవారం ఉదయం ఢిల్లీ విమానాశ్రయంలో వందకు పైగా విమానాలు ఆలస్యమయ్యాయి. సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని, విమాన అంతరాయంపై విచారం వ్యక్తం చేస్తూ విమానాశ్రయ అధికారులు ప్రకటన విడుదల చేశారు.

## డిసెంబర్‌లో షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. దాదాసాహెబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిల్మ్ స్టడీ సంస్థ ద్వారా డిసెంబర్ 19 నుంచి 21 వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

## ఏపీఐఐసీ బోర్డు డైరెక్టర్ల నియామకం

**అక్షరటుడే, అమరావతి:** ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ)కు బోర్డు డైరెక్టర్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పలు జిల్లాల నుంచి 15 మంది సభ్యులను బోర్డు డైరెక్టర్లుగా నియమించింది. వీళ్లంతా రెండేళ్లపాటు పదవిలో కొనసాగనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

## 100 బిలియన్ డాలర్ల క్లబ్‌లోకి ఎస్‌బీఐ



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** ఒకప్పుడు నష్టాల్లో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నేడు 100 బిలియన్ డాలర్ల క్లబ్‌లోకి చేరిందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. 2018లో నష్టాల్లో ఉన్న ఎస్‌బీఐ రిజర్వ్ బ్యాంక్ చేపట్టిన సంస్కరణలతో ఈ స్థాయికి చేరిందన్నారు. ముంబయిలో జరిగిన ఎస్‌బీఐ బ్యాంకింగ్, ఎకనమిక్స్ కాన్‌క్లేవ్ 2025లో మాట్లాడారు.

## ఆర్టీసీ బస్సును ఢీకొన్న డీసీఎం..

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** హైదరాబాద్‌లో మరో బస్సు ప్రమాదం జరిగింది. సిగ్నల్ వద్ద ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును డీసీఎం ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆరాంఘర్ చౌరస్తా సిగ్నల్ వద్ద ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి వేగంగా వచ్చిన డీసీఎం ఢీకొంది. శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. షాద్‌నగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న బస్సును డీసీఎం బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో బస్సులోని ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

## రైనా, ధావన్‌పై సజ్జనార్ ఆగ్రహం

**అక్షరటుడే, హైదరాబాద్:** క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్ ధావన్‌పై హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అభిమానాన్ని సొమ్ము చేసుకునే వీళ్లు ఆదర్శ ఆటగాళ్లు ఎలా అవుతారని ప్రశ్నించారు. "బెట్టింగ్ మహమ్మారికి ఎందరో యువకులు బలవుతున్నారు. వేల మంది ఆత్మ హత్యలు చేసుకుంటున్నారు. బెట్టింగ్ భూతాన్ని ప్రచారం చేసిన వీరు వీటన్నింటికీ బాధ్యులు కారా..? సమాజ మేలు కోసం, యువత ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి నాలుగు మంచి మాటలు చెప్పండి. అంతే కానీ మిమ్మల్ని అభిమానించే వాళ్లను తప్పుదోవ పట్టించి.. వారి ప్రాణాలను తీయకండి" అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు గడువు సమీపిస్తుండడంతో రాష్ట్రంలో రాజకీయాలు వేడెక్కాయి. ప్రచారానికి మరో రెండురోజులు మాత్రమే గడువు ఉండడంతో ప్రధాన పార్టీలు తమ ప్రయత్నాలు మరింత ముమ్మరం చేశాయి. ర్యాలీలు, రోడ్‌షోలతో పాటు ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను ఆకర్షించే పనిలో పడ్డాయి. ఈ సందర్భంగా ముఖ్యనేతలు సవాళ్లు ప్రతిసవాళ్లతో స్టేట్ పాలిటిక్స్ రసవత్తరంగా మారాయి.**

– అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి




# బస్తీ మే సవాల్..

- జూబ్లీహిల్స్‌లో జోరుగా ప్రచారం
- ప్రచారానికి మిగిలింది రెండు రోజులే..
- గెలుపే లక్ష్యంగా పోరాడుతున్న పార్టీలు
- ఘాటైన మాటలతో హీటెక్కిస్తున్న నేతలు
- సవాళ్లు, ప్రతిసవాళ్లతో హోరెత్తిస్తున్న నాయకులు

నవంబర్ 11న జరుగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో 58 మంది పోటీ పడుతుండగా, మూడు పార్టీల మధ్యే ప్రధాన పోరు నెలకొంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీ సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. ఈ ఉప ఎన్నికలో గెలిస్తేనే తర్వాత జరుగనున్న కీలకమైన స్థానిక, పుర పోరులో సత్తా చాటే అవకాశం ఉండడంతో మూడు పార్టీలూ శాయశక్తులా పోరాడుతున్నాయి. ప్రధానంగా అత్యధికంగా ఓటర్లు నివాసమున్న బస్తీలపై ఫోకస్ చేశాయి. బీసీ, మైనార్టీ వర్గాల ఓటర్లను ఆకట్టుకునే దిశగా ప్రయత్నాలు చేస్తున్నాయి.

సంపన్న వర్గాల కేంద్రంగా చెప్పుకునే జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో మెజార్టీ ప్రజలు పేద, మధ్య తరగతికి చెందిన వారే ఉన్నారు. ఇక్కడి బస్తీలు, కాలనీలు, మురికివాడల్లో ఉంటున్న ప్రజలే ఎక్కువ. నియోజకవర్గంలో మొత్తం 4.01 లక్షల ఓటర్లు ఉండగా, అత్యధికంగా ఆయా వర్గాలకు చెందిన వారే కావడం గమనార్హం. బోరబండ, రహమత్ నగర్, షేక్‌పేట వంటి డివిజన్లలో పేదలు అత్యధికంగా నివాసముంటున్నారు. వారు ఏ పార్టీ వైపు మొగ్గితే ఆ పార్టీ విజేత కావడం ఖాయం. అందుకే సమే ప్రధాన పార్టీలు పేదలు నివాసముండే బస్తీలు, కాలనీలు, మురికివాడలపై దృష్టి సారించాయి. ఒక్కో వార్డుకు కనీసం పది నుంచి వంద మంది వరకు నేతలు, కార్యకర్తలను మోహరించాయి. ప్రతి ఇంటికీ ఉదయం, సాయంత్రం రెండుసార్లు వెళ్లి ప్రచారం చేస్తున్నాయి. ఇక ర్యాలీలు, రోడ్ షోలతో హల్‌చల్ చేస్తున్నాయి.

### సవాళ్లు.. ప్రతి సవాళ్లు..

పార్టీల గెలుపు బాధ్యతలు మోస్తున్న ప్రధాన నాయకులు జూబ్లీహిల్స్‌లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. రోడ్‌షోలు, ర్యాలీలతో హోరెత్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో సవాళ్లు, ప్రతి సవాళ్లతో పొలిటికల్ హీట్ సృష్టిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ మధ్య ప్రధానంగా సవాళ్ల పర్వం నడుస్తోంది. అభివృద్ధి, అవినీతి, కేసుల విచారణ తదితర విషయాలపై ఒకరికొకరు సవాళ్లు విసురుకుంటుండడం రసవత్తరంగా మారింది. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని, కాళేశ్వరం, ఈ కార్ రేస్ వంటి దర్యాప్తులను కేంద్రానికి అప్పగిస్తే కనీసం అడుగు ముందుకు పడడం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే ఉప ఎన్నిక జరిగేలోపు కేటీఆర్, హరీశ్‌రావును అరెస్టు చేయాలని సవాలు విసిరారు. గత మున్సిపల్ మంత్రి చెత్తగాడని, అందుకే ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయిందని కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు ఎక్కుపెట్టారు. సీఎం విమర్శలను తిప్పకొట్టిన కేటీఆర్.. దమ్ముంటే అభివృద్ధిపై సవాల్ విసిరారు. ప్రభుత్వం పెట్టినవన్నీ లొట్టపీసు కేసులని, తాము తప్పు చేసి ఉంటే రేవంత్‌రెడ్డి ఇలా వదిలేవాడా? అని ప్రశ్నించారు. ఇలా ఒకరికొకరు సవాళ్లు విసురుకుంటుండడంతో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి.

## ఎన్నికల టైంలో సోదాలు సహజం




**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ నేతల ఇళ్లలో ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ సోదాలు చేపట్టింది. ఈ అంశంపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. ఎన్నికల టైంలో సోదాలు సహజమన్నారు. ఎవరి ఇంట్లో అయినా అధికారులు తనిఖీలు చేస్తారని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం పరిధిలో ఫ్లయింగ్ స్క్వాడ్ పనిచేస్తుందని చెప్పారు. ఎవరిపైనైనా ఫిర్యాదులు వస్తే సోదాలు చేయడం ఎన్నికల సంఘం హక్కు అని తెలిపారు. ప్రతిదాన్ని రాజకీయం చేయడం గులాబీ పార్టీ నేతలకు అలవాటుగా మారిందని విమర్శించారు. ఇక జూబ్లీహిల్స్‌లో బీజేపీకి 10 వేల ఓట్లు కూడా రావని ఎద్దేవా చేశారు. కిషన్‌రెడ్డి నియోజకవర్గంలోనే ఆ పార్టీని ఎవరూ పట్టించుకోవడం లేదని పొన్నం విమర్శించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం చేసుకున్నాయని వ్యాఖ్యానించారు.

## డిసెంబర్ 30 నుంచి వైకుంఠ ద్వార దర్శనం



**అక్షరటుడే, తిరుమల:** తిరుమల శ్రీవారి భక్తుల విజ్ఞప్తి మేరకు అంగ ప్రదక్షిణ టోకెన్ల జారీని డిప్ విధానం నుంచి మార్చినట్లు ఈవో అనిల్ కుమార్ సింఘాల్ తెలిపారు. ముందు వచ్చిన వారికి ముందు ప్రాతిపదికన వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి ఆన్‌లైన్ కోటా విడుదల చేయనున్నట్లు చెప్పారు. తిరుమలలోని శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో నవంబరు 17 నుంచి 25వ తేదీ వరకు కార్తీక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. భక్తుల సూచనల మేరకు శ్రీవారి దర్శనాలకు సంబంధించి శ్రీవాణి, ఇతర దర్శన టోకెన్లు జారీ చేసే విధానంపై పరిశీలించి నివేదిక సమర్పించేందుకు తితిదే బోర్డు ఒక కమిటీని ఏర్పాటు చేసిందని ఆయన చెప్పారు. కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని వివరించారు. తిరుమలలో డిసెంబర్ 30 నుంచి 2026 జనవరి 8వ తేదీ వరకు శ్రీవారి భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తామని పేర్కొన్నారు. ఇందు కోసం ఆఫ్‌లైన్, ఆన్ లైన్ టోకెన్ల జారీ విధి విధానాలు త్వరలో తెలియజేస్తామని చెప్పారు.

## వీధి కుక్కల కేసు.. సుప్రీం కీలక ఆదేశాలు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** వీధి కుక్కల కేసులో దేశ సర్వోన్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. బహిరంగ ప్రదేశాల నుంచి వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని సుప్రీం కోర్టు స్పష్టంచేసింది. విద్యాసంస్థలు, క్రీడా సముదాయాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ఇతర జనావాస ప్రదేశాల నుంచి తరలించాలని ఆదేశించింది. అంతేకాకుండా బహిరంగ ప్రదేశాలకు వెళ్లకుండా కంచెలు వేయాలని సూచించింది. కుక్కలు లేవని నిర్ధారించుకునేందుకు క్రమంతప్పకుండా తనిఖీలు చేయాలని చెప్పింది. ఏ కారణంతోనైనా మళ్లీ వాటిని పట్టుకున్న చోటనే వదిలివేయకూడదని ఆదేశాలు జారీ చేసింది.

## నిరాశ పరుస్తున్న ఐపీవోలు




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** దేశీయ స్టాక్ మార్కెట్‌లో అనిశ్చితి కొనసాగుతోంది. యూఎస్‌తో ట్రేడ్ డీల్ ఎటూ తేలకపోవడం, ఎఫ్ఐఐల అమ్మకాలు కొనసాగుతుండడం, గరిష్టాల వద్ద ప్రాఫిట్ బుకింగ్ జరుగుతుండడంతో మార్కెట్లు నిలదొక్కుకోలేకపోతున్నాయి. దీని ప్రభావం ప్రైమరీ మార్కెట్‌పైనా పడుతోంది. భారీగా ఓవర్ సబ్‌స్క్రైబ్ అవుతున్న ఐపీవోలు సైతం లిస్టింగ్ గెయిన్స్ ఇవ్వలేకపోతున్నాయి. గురువారం లిస్టయిన ఓర్కలా స్వల్ప లాభాలతో ప్రారంభమై వెంటనే నష్టాల్లోకి జారుకోగా.. శుక్రవారం లిస్టయిన స్టడ్స్ యాక్సెసిరీస్ నష్టాలతోనే ప్రస్థానాన్ని ప్రారంభించింది.


## కీర్తి సురేష్‌కు క్యూ కట్టిన ప్రాజెక్టులు



తెలుగు సినీ ఇండస్ట్రీలో 'నేను శైలజ' చిత్రంతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన కీర్తి సురేష్, తన నటనతో అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. అయితే, కీర్తి చిన్నతనం నుంచే చైల్డ్ ఆర్టిస్టుగా పలు సినిమాల్లో నటించి మెప్పించింది. 'మహానటి'లో లెజెండరీ నటి సావిత్రి పాత్రలో జీవించింది. దాంతో ఆమెకి జాతీయ స్థాయి గుర్తింపు దక్కింది. అయితే, ఆమె తన చిన్ననాటి స్నేహితుడు ఆంటోనీని వివాహం చేసుకున్న తర్వాత సినిమాలకు కొంత గ్యాప్ ఇచ్చారు. ఈ విరామం తర్వాత ఆమె తిరిగి ఫుల్ ఫోర్స్‌తో సినిమాల్లోకి ఎంట్రీ ఇస్తున్నారు. కీర్తి ప్రస్తుతం పలు భాషల్లో క్రేజీ సినిమాలతో బిజీగా ఉన్నారు. తెలుగులో రౌడీ జనార్ధన్, హిందీలో 'అక్క' అనే పీరియాడికల్ డ్రామా చేస్తున్నారు. తమిళంలో 'రివాల్వర్ రీటా'లో కూడా లీడ్ రోల్ చేస్తున్నారు. మలయాళంలో 'తొట్టం' అనే యాక్షన్ థ్రిల్లర్‌లో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇలా ఒకేసారి నాలుగు భాషల్లో ప్రాజెక్టులు చేయడం ద్వారా కీర్తి తన కెరీర్‌లో కొత్త దశను ప్రారంభించినట్లు స్పష్టమవుతోంది.

– అక్షరటుడే, సినిమా డెస్క్

## వందేమాతరం మూలభావం అదే: మోదీ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** వందేమాతరం గేయం ఒక స్వప్నం, ఒక సంకల్పం, ఒక మంత్రం అని ప్రధాని మోదీ అన్నారు. అది దేశమాత ఆరాధన, సాధన అని పేర్కొన్నారు. ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన వందేమాతరం 150వ స్మారకోత్సవంలో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. వందేమాతరం గేయం మనందరినీ పురాణ ఇతిహాసాల్లోకి తీసుకెళ్తుందని చెప్పారు. 'వందేమాతరం శబ్దం ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది. భవిష్యత్తుకు సరికొత్త భరోసా ఇస్తుంది. ఈ సామూహిక గేయాలాపన అద్భుత అనుభవం. ఒకే లయ, స్వరం, భావంతో గేయాలాపన హృదయాన్ని స్పందింపజేస్తుంది' అని అన్నారు.

## త్వరలో భారత్ పర్యటనకు వస్తా: ట్రంప్



**అక్షరటుడే, వెబ్‌డెస్క్:** భారత్‌పై ఇటీవల భారీగా సుంకాలు విధించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో వాణిజ్య చర్చలు సజావుగా సాగుతున్నాయని ఆయన తెలిపారు. వచ్చే ఏడాది తాను భారత పర్యటనకు వస్తానన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గొప్ప వ్యక్తి అని, ఆయన నా స్నేహితుడు అని ట్రంప్ ప్రశంసించారు. రెండు దేశాల మధ్య ఆర్థిక, వ్యూహాత్మక సహకారాన్ని బలోపేతం చేయడానికి వచ్చే ఏడాది తాను భారత్ వెళ్లవచ్చన్నారు. మోదీ రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేయడం చాలావరకు మానేశారని ట్రంప్ పేర్కొన్నారు.